సంపుటం 18 సంచిక 106

రిజిస్టరు నెం. H 45 స్థాపితము 1925

గోలకొండపత్రిక

22-4 1960 హైదరాబాదు శుక్రవారం

సంపాదకుడు: ఎన్. నరోత్తమరెడ్డి ఎం. ఎ.

4 పేజులు 7 నయాపైసలు

శ్రీ వై. బి. చ్యవన్ నాయకత్వం

బొంబాయి, ఏప్రిల్ 21: మే 1వ తేదీనుండి అస్తిత్వం లోనికి రాగల నూతన మహారాష్ట్ర రాష్ట్ర కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకునిగా ప్రస్తుత బొంబాయి రాష్ట్ర ముఖ్యమంత్రి వై. బి. చ్యవన్ ఏకగ్రీవంగా ఎన్నికయినారు.

ప్రస్తుత బొంబాయిరాష్ట్ర ఉభయ శాసనసభలకు చెందిన 197 మంది కాంగ్రెస్ సభ్యులలో చాలా మంది కౌన్సిల్ హాలులో జరిగిన ఈ పార్టీ సమావేశంలో పాల్గొన్నారు. ఎమ్. ఎస్. కన్నమ్‌వార్ (విదర్భ) మహారాష్ట్ర కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ డిప్యూటీ లీడర్‌గా ఎన్నికయ్యారు.

నేడే ఉ॥ 9-00 గం॥ గొప్ప వేలం

సిద్దంబర్ బజారులో జేగంబజార్ పోయే సిమెంటు రోడ్డు పైన గల 3 అంతస్తుల యిల్లు నెం. 12/15.8 మరియు వరండాతోగల 2 అంతస్తుల మల్గీలు నెం. 16-9/15-5 లను వేలం వేయబడును.

ఇఖ్‌బాల్ ఫ్రండ్స్ ఆక్షనీర్స్

మొగల్‌పుర, హైదరాబాదు.

101253

మూడవ ప్రణాళికలో ఉద్యోగావకాశాల విస్తృతీకరణ

సరిహద్దు వివాదంపై గౌరవప్రదమైన పరిష్కారం సాధ్యం

నెహ్రూ- చౌ ఎన్‌లైల ఆశాభావం: రాష్ట్రపతి భవన్‌లో విందు సందర్భంగా ప్రసంగాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

ఇండియా - చైనా సరిహద్దు వివాదాన్నిగురించి తామిరువురూ ప్రారంభించినచర్చలు విజయవంతం కాగలవనీ, ఇదమిత్థమైన ఫలితాల్ని సాధించగలవనీ గతరాత్రి విందు సందర్భ గా భారత ప్రధాని శ్రీ నెహ్రూ, చైనా ప్రధాని చౌఎన్‌లై ఆశాభావంప్రకటించారు.

రాష్ట్రపతి భవన్‌లో చౌ ఎన్ లై గౌరవార్థంగతరాత్రిప్రధానినెహ్రూ విందు జరిపారు.

ప్రధాని నెహ్రూ ప్రసంగిస్తూ ఉభయదేశాల ఆత్మగౌరవానికిమర్యాదకు అనుగుణంగా, ఆసియా తద్వారా ప్రపంచ శాంతి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొంటూ ప్రస్తుతవివాదానికి పరిష్కారం సాధించబడాలని అన్నారు. ఇందుకుగాను మా పక్షాన మేము సర్వవిధాలా ప్రయత్నిస్తామని వాగ్దానం చేస్తున్నాను అని కూడా నెహ్రూ చౌఎన్‌లైకు ఉద్ఘోషించిచెప్పారు.

చైనా ప్రధాని చౌఎన్‌లై సమాధానమిస్తూ ఇండియా చైనాల మధ్య నిర్వహింపవలసి ఉన్న స్నేహపూర్వక సహకారపు ప్రాధాన్యదృష్ట్యా ప్రస్తుత సమస్య చాల పరిమితమైనది, తాత్కాలికమైనదిఅన్నారు. చరిత్రాత్మకమైన గతాన్ని ప్రస్తుత సత్యాల్ని దృష్టిలో ఉంచుకొని పంచశీలకు అనుగుణంగా పరస్పరావగాహన పరస్పరం సర్దుబాటు తత్వాలతో ఇరుదేశాలూ స్నేహపూర్వకమయిన శాశ్వత ప్రయోజనాలకోసం వ్యవహరిస్తే సరసమయిన సహేతుకమయిన సంపూర్ణ పరిష్కారం సాధించడానికి అవకాశాలున్నాయని కూడా చౌఎన్‌లై పేర్కొన్నారు.

శ్రీ నెహ్రూ తన ప్రసంగములో యీ సరిహద్దు వివాదం చాల విచారకర విషయమన్నారు. రెండుదేశాలకు చెందిన వేలాది సంవత్సరాల ప్రాచీన వాగరకతలు మన సమావేశానికి సాక్ష్యంగా నిలుస్తాయనీ సుఖమయ భవిష్యత్తుకోసం ఆశించే కోట్లాదిప్రజల ఆశలు మన ప్రయత్నాలతో ముడిపడి ఉన్నాయనీ అన్నారు.

చౌఎన్‌లై ఇందుకు జవాబిస్తూ వలసరాజ్య పరిపాలనా యంత్రాంగం ఫలితంగా మనఉభయదేశాలకూ అంటకట్టబడినక్లిష్టసమస్యయే యీసరిహద్దు సమస్య అన్నారు. మన ఉభయుల చర్చలు సత్ఫలితాలనిస్తాయనే ఆశిస్తున్నానని చౌఎన్‌లై పేర్కొన్నారు.

రాష్ట్రంలో కౌలుదార్ల సేద్యసంఘాలనుగూర్చి సర్వే

ప్లానింగ్ కమిషన్ తలంపు

హైదరాబాద్, ఏప్రిల్ 21

వివిధ రాష్ట్రాల్లో సంయుక్త సహకార సేద్య విధానాన్నిగురించి సర్వే జరిపించాలన్న ప్రతిపాదనను ప్లానింగ్ కమిషన్ పరిశీలిస్తున్నది.

ఆంధ్ర ప్రదేశ్‌లో మాత్రం సంయుక్త సహకారసేద్యసంఘాలు చాల కొద్దిగా ఉన్నాయి. అయితే కౌలుదార్ల సేద్య సంఘాలుమాత్రం చాలా ఉన్నాయి. అందువల్లఆంధ్రప్రదేశ్‌లో కౌలుదార్ల సేద్య సంఘాలవిషయంలో పరిశీలన - సర్వేజరిపించాలనిప్లానింగ్ కమిషన్ ఒక సూచనను ఆలోచిస్తున్నదట.

బహుశా యీ సర్వే కార్యక్రమ నిర్వహణ బాధ్యతను హైదరాబాద్‌లోని ఇండియన్ ఎకనమిక్స్ ఇన్‌స్టిట్యూట్‌కు ఇవ్వవచ్చు, ఏ సంగతీకొద్దిరోజుల్లో తేల్చబడుతుంది.

రాష్ట్రంలోఉన్న 900 కౌలుదార్ల సేద్య సంఘాలందు 10 శాతం సర్వేకొరకు గైకొనబడవచ్చునని ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీ ఎస్. వి. అయ్యంగార్ అన్నారు. పంటల ఉత్పత్తిని గురించిన సర్వే కూడా ఇన్‌స్టిట్యూట్‌కు అప్పగించేవిషయం రాష్ట్రప్రభుత్వం ఆలోచిస్తున్నదట.

కలకత్తాలోని యునెస్కో కేంద్రం వారు జంటనగరాల్లోశ్రమపు శ్రమను గూర్చిన సర్వేను కూడా యీ ఇన్‌స్టిట్యూట్‌కు అప్పగించ దలిచారు.

స్టార్చి ప్రొడక్ట్సు ఫ్యాక్టరీ మూసివేత

సక్రమమే అని పారిశ్రామిక ట్రిబ్యునల్ తీర్పు

హైదరాబాదు, ఏప్రిల్ 21

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ట్రిబ్యునల్ అధ్యక్షుడు డా॥ మిర్ సయాదత్ అలీఖాన్ హైదరాబాదు స్టార్చి ప్రొడక్ట్సు ఫ్యాక్టరీ మూసివేత సక్రమమేనని, అందువలన కార్మికులకు ఎట్టి సహాయమూ లభించదనితీర్పునిచ్చారు.

ఆఫ్యాక్టరీ యజమానులు కార్మికుల మధ్యగల వివాదంపై తీర్పు వెలువరా॥ఖాన్ ఆభిప్రాయంవ్యక్తపరిచారు

ఆ ఫ్యాక్టరీని మూసివేసి 110మంది కార్మికుల్ని నిరుద్యోగుల్ని చేయడం సక్రమమా, కాకపోతే కార్మికులకు ఎట్టి రిలీఫ్ యివ్వాలి అనే అంశం ట్రిబ్యునల్‌కు నివేదించబడింది.

ఈ ఫ్యాక్టరీ ఉత్పత్తి విషయంలో మాత్రమే 1959 జూన్ 22న తాత్కాలికంగా మూసివేయబడింది.

ఆర్థిక ఇబ్బందులవలననే ఆఫ్యాక్టరీ మూసివేయబడిందని ట్రిబ్యునల్ పేర్కొన్నది.

14 గురిని చంపి దోచుకొన్న దొంగ

కైరిచెరా, ఏప్రిల్ 21

ఐదుగురు స్త్రీలతో సహా 14 గురిని గత ఆదివారం కాల్చిచంపిన ఒకవ్యక్తి కోసంపోలీసులు ఇంకాగాలిస్తున్నారు.

హుసు జిల్లాలోని గాంవాస్ గ్రామంలో అతడు ఒక రివాల్వర్‌తో ప్రవేశించి 8 మంది పురుషుల్ని, ఐదుగురు స్త్రీలను, ఒక బాలికను కాల్చిచంపి, మరి యిద్దరిని గాయపర్చాడు. కొన్నియిండ్లను దోచుకొని, రొక్కం, ఆభరణాలు చేతబూని ఒక బస్సెక్కి వెళ్ళిపోయాడు. తరువాత ఒంటె 27 మైళ్ళదూరంలో కనబడింది. పోలీసులు దానిని స్వాధీనపర్చుకొన్నారు.

ఈ దొంగ పిన తండ్రిని ప్రజలలో రెండు వర్గాల మధ్య జరిగిన కొట్లాట సందర్భంలో 1958 నవంబర్‌లో అదే గ్రామంలో చంపివేశారు.

రష్యా సహాయంతో అణుశక్తి ప్లాంటు

ఏర్పాటుచేసే విషయమై చర్చలకు త్వరలో డా॥ భాభా ప్రభృతుల సోవియట్ ప్రయాణం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

అణుశక్తిని శాంతియుత ఉపయోగానికై అభివృద్ధి పరిచేందుకు ఇండియా - సోవియట్‌ల మధ్య ఒప్పందం కుదుర్చుకొనే నిమిత్తం చర్చలు జరిపేందుకు భారత ప్రతినిధివర్గం త్వరలో సోవియటు యూనియన్‌కు వెళుతుందని విదేశాంగ వ్యవహారాలశాఖ ఉపమంత్రిణి శ్రీమతి పి. లక్ష్మీమీనన్ నేడు రాజ్యసభలో శ్రీ పి. ఎస్. రాజ్‌భోజ్ ప్రశ్నకు జవాబిస్తూ అన్నారు.

ఈవిషయమై ఉభయ దేశాల ప్రతినిధులు ఒకరి అభిప్రాయాల్ని ఒకరు తెలుసుకోవడం లోగడనే జరిగిందని ఆమె అన్నారు.

ఈ పనిపై అణుశక్తికమిషన్ అధ్యక్షుడు డా॥ భాభా సోవియటుయూనియనుకు వెళ్ళవచ్చునని శ్రీ నెహ్రూ అన్నారు.

దేశంలో చాల చిన్న చి అయిన అనేక అణుశక్తి యంత్రాలను నెలకొల్పాలని ప్రభుత్వం సంకల్పిస్తున్నదని ప్రధాని అన్నారు ఈ విషయమై ప్రభుత్వం వివిధ దేశాల సహాయాన్ని [illegible] తగు సహాయాన్ని కోరవచ్చునని నెహ్రూ అన్నారు.

కోయిలకుంట్ల తాలూకాలో శిస్తు మాఫీ

హైదరాబాదు, ఏప్రిల్ 21

కర్నూలు జిల్లా కోయిలకుంట్ల తాలూకాలోని దిగువ తెలిపిన 9 గ్రామాలలో 1369 ఫసలికి మెట్ట భూములపై శిస్తును, వాణిజ్య పంటలపై ప్రత్యేక పన్నును అనుకూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ క్రింది విధంగా రద్దు చేయటానికి ప్రభుత్వము నిశ్చయించింది.

1. నాలుగోవంతు అంతకు తక్కువగా పండిన చోట పూర్తి మాఫీ.

2. నాలుగణాల వంతుకు ఎక్కువగాను ఆరణాల వంతుకు తక్కువగాను పండినచోట సగం మాఫీ. అంతేగాక దెబ్బతిన్న గ్రామాలలో భూమి శిస్తు, తక్కావీ ఋణాల వసూలును ఒకసంవత్సరం పాటు వాయిదా వేయటానికి కూడ ప్రభుత్వం నిర్ణయించింది.

దెబ్బతిన్న గ్రామాలు: కొలిమిగుండ్ల, [illegible] పంగిలా [illegible] పుర్రం, తుమ్ముల పెంట, యిస్పాచర్, చెన్నంపల్లి, తెలుము, మీర్జాపురం, సింగవరం.

జీపుల కొనుగోలు కేసు పరిష్కారం

కోర్టుబయటే జరగాలని ప్రధానినెహ్రూ: లోకసభలో వాయిదా తీర్మానం త్రోసివేత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

శ్రీ ఎన్. జి. గోరే ప్రభృత నల్గురు సభ్యులు ప్రతిపాదించగోరిన వాయిదా తీర్మానంపై ప్రధాని నెహ్రూ నేడు లోకసభలో ప్రసంగిస్తూ మే 2న లండన్ కోర్టు ముందుకు రావలసియున్న జీపు కేసు విచారణ మూడు రోజుల క్రితమే ప్రారంభమైనదన్నారు. అయితే పరిష్కారం యింకా కుదరలేదన్నారు.

జీపు కేసులో 250,000 పౌండ్ల పరిహారం కోరాలనే నిర్ణయాన్ని భారత ప్రభుత్వం మార్చుకొన్నట్లు తెలియవచ్చిందనీ, ఆ పరిస్థితిపై చర్చ జరపాలనా తీర్మానానికి నోటీసు యిచ్చినవారు పేర్కొన్నారు.

రెండో పక్షం కోరుతున్న 14,000 పౌండ్లను భారత ప్రభుత్వం చెల్లించకపోవడమే ఒప్పందంలో భాగమనీ, ఆ మొత్తాన్ని చెల్లించడానికి భారత ప్రభుత్వం లోగడ అంగీకరించి ఉన్నదనీ శ్రీ నెహ్రూ అన్నారు. ఉభయ పక్షాలూ తమ క్లెయింలూ, ప్రతిక్లెయింలను ఉపసంహరించుకొంటాయి.

ప్రభుత్వం కోర్టుబయట పరిష్కారం కావాలని ఎందుకు కోరుతున్నదని ప్రశ్నించగా రెండో పక్షంనుండి పరిహారం పొందేమార్గం కనిపించడం లేదని నెహ్రూ అన్నారు. అదీగాక రెండో పక్షం భారత ప్రభుత్వం విధించిన షరతులకు అంగీకరిస్తున్నది. అందువలన యీ కేసు విషయమైపెద్ద మొత్తాల్ని ఖర్చుచేయరాదని ప్రభుత్వం భావించినది. ఈ అంశానికి సంబంధించిన పత్రాలు అందగానే అవి సభ బల్లపై ఉంచబడుతాయన్నారు.

రక్షణ మంత్రి శ్రీ కృష్ణమీనన్ లండన్‌లో హైకమిషనర్‌గా ఉండగా యీ జీపుల కొనుగోలులో ప్రత్యక్షంగా నిమగ్నం కాలేదని నెహ్రూ అన్నారు.

అంతట స్పీకర్ వాయిదా తీర్మానాన్ని త్రోసివేశారు.

నెహ్రూ-చౌ సంప్రదింపులు

కొత్తఢిల్లీ, ఏప్రిల్ 21

ప్రధానినెహ్రూమరియు చైనాప్రధాని చౌఎన్‌లై నేడు తమ సంప్రదింపుల సాయంత్రం 4 గంటలకు ప్రారంభించారు.

ఇవి ప్రధానినెహ్రూ ఇంట జరిగినవి. దుబాసీలుతప్ప ఈ ఇద్దరు నాయకులవెంట మరెవరూ సంప్రదింపులలో లేరు. భారత అధికారులు క్రింది అంతస్తులోని డ్రాయింగ్ రూమ్ అవసరమైనచో పిలుపు అందుకొనడానికి తగు పక్కాలలోపేచి ఉండిరి.

ఉభయప్రధానుల సంప్రదింపులు 2 గంటల ముప్పదిఐదు నిముషాలు సాగినవి.

సరిహద్దు వివాదానికి సంబంధించిన వివిధాంశాల చర్చించారని భావింపబడుచున్నది.

నిరుద్యోగ సమస్యకు ప్రాధాన్యమివ్వాలని సూచన

కార్మిక వర్గాలలో పరిమిత కుటుంబ విధానాన్ని ప్రచారంచేయాలని లోకసభ అంచనాల కమిటి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

మూడవ ప్రణాళికలో నిరుద్యోగ నివారణకు అధిక ప్రాధాన్యమివ్వాలని ప్రజలలో ముఖ్యంగా తక్కువ ఆదాయంగల కార్మిక వర్గాలలో పరిమిత కుటుంబాన్నిగూర్చి ప్రచారం చేయాలని లోకసభ అంచనాల కమిటీ ప్రభుత్వాన్ని కోరినది.

నేడు సభకు అందచేయబడిన 83 పేజీల రిపోర్టులో మూడవ ప్రణాళిక ప్రారంభంలో నిరుద్యోగుల సంఖ్య 7.5 మిలియన్‌లనుండి 8 మిలియన్‌ల వరకు ఉండవచ్చునని అంచనా వేయబడినది. మూడవ ప్రణాళిక కాలంలో నిరుద్యోగ తీవ్రతను తగ్గించడానికి తక్కువలో తక్కువ 21 మిలియన్‌ల నుండి 22 మిలియన్‌ల ఉద్యోగాల సృష్టించవలసి రాగలదు. ఐతే ఆ మేరకు ఉద్యోగావకాశాల సృష్టించే అవకాశం ప్రస్తుతం మనకుగల అవకాశాల దృష్ట్యాలేనందున ఈ ప్రణాళికాంతానికి దాదాపు 8 మిలియన్‌ల వరకు నిరుద్యోగ కార్మికులు మిగిలిపోవచ్చును.

గ్రామాలు మరియు జిల్లాలస్థాయిలో ఉద్యోగావకాశాల పెంచాలన్న కార్మికమంత్రి ప్రతిపాదనను అమలు పరచి చూడాలని అంచనాల సంఘం తన రిపోర్టులో సూచించినది. విద్యావంతులలో నిరుద్యోగం తీవ్ర గతిన పెరుగుతుండటాన్ని అంచనాలకమిటి ఈ రిపోర్టులో పేర్కొని ప్రభుత్వం వీరికి ఉద్యోగాలకల్పనకై ఎక్కువ శ్రద్ధ కనబరచాలని సూచించినది. ఉద్యోగ సాధక కేంద్రాల ప్రభుత్వం రిక్రూట్ మెంట్‌లకై ఎక్కువగా ఉపయోగించుకోవాలని కోరినది.

మార్చిలో చక్కెర ఉత్పత్తి

కలకత్తా, ఏప్రిల్ 21

1960 మార్చిలో భారత దేశంలో 442 వేల టన్నుల చక్కెర ఉత్పత్తి అయినదని క్రితం సంవత్సరం ఇదే కాలంలో ఉత్పత్తి అయిన చక్కెర 866 వేల టన్నులని భారత చక్కెర మిల్లుల సంఘపు ప్రకటన ఒకటి తెలుపుచున్నది.

కార్మిక సంఘం నమోదు

బ్రిటిష్ ఇండియా టొబాకో కార్పొరేషను పనివారల సంఘం, మంగళగిరి, గుంటూరుజిల్లా- కార్మిక సంఘాల చట్టంక్రింద నమోదు చేయబడింది. ఈ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీయుతులు ఎం. వెంకటరాజు, ఎం. ఎల్. ఎ. పి.సోమసుందరరావులు వ్యవహరిస్తున్నారు

వైద్య ఆరోగ్యశాఖల ఉద్యోగుల డిమాండ్లు

మంత్రి పి.వి.జి. రాజు అనుకూల్య ప్రకటన

హైదరాబాద్, ఏప్రిల్ 21

ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య వైద్య ఉద్యోగుల సంఘ అధ్యక్షులు టి అంజయ్య ఎం.ఎల్.ఏ. ఈ సంఘ కార్యదర్శి బాసిక్ రజ్జాక్ ఆరోగ్య వైద్యశాఖలమంత్రి శ్రీ పి. వి. జి. రాజుతో జరిపిన సంప్రతింపులు ఫలప్రదమై ఈరోజు సమ్మెను ప్రారంభించవలసిన అవసరం కలుగలేదు.

ఈపనివారల నాల్గు డిమాండ్ల విషయంలో మంత్రి సానుభూతిని ప్రకటించారు. ఈఉద్యోగులకు డ్రెస్ ఇవ్వడానికి వారు ఒప్పుకున్నారు. వారపు సెలవులుకాక ఏడాదికిముప్పది క్యాజువల్ సెలవులుండాలని మంత్రి అంగీకరించారు. వేతనపు స్కేళ్ళ సవరింపుకుగూడా అనుకూల్యాన్ని ప్రకటించారు. ప్రమాదపు ఆలవెన్సుమగూర్చి ఇతర రాష్ట్రాలలో ఇట్టి పద్ధతి అమలులోవున్నది లేనిది చూచి తగుచర్య తీసుకొనబడగలదన్నారు.

హైదరాబాద్, ఏప్రిల్ 21

అర్థ్రె కొనుగోలు పద్ధతిపై ఆంధ్రప్రదేశ్‌లో 1960-61 సంవత్సరశాలములో రు. 6 లక్షల విలువయిన 40కి ట్రాక్టర్‌లను పంపిణీ చేయడానికి రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసింది. రు. 6 లక్షల 28 వేల ఖర్చుతో తెలంగాణ ప్రాంతంలో తక్కావీ క్రింద ఆయిల్ ఇంజనులు, ఎలక్ట్రిక్ మోటార్లను పంపిణీ చేయాలని కూడ సంకల్పించబడింది.

రు. 30 వేలకుతక్కువగాని భూమి సెక్యూరిటీగా రైతుకు రు. 16 వేల విలువచేసే ట్రాక్టర్ వరకూ కొనడానికి ఋణాలు మంజూరు చేయబడుతాయి. దీనిపై 4 శాతం వడ్డీఉంటుంది. పది వార్షిక వాయిదాలలో దానిని తిరిగి చెల్లించాలి. ఆయిల్ ఇంజన్లు ఎలక్ట్రిక్ మోటార్ల కనుగోలుకు రు. 2000 గాని మిషనరీ ఖరీదులో 90 శాతంగాని మంజూరి చేయబడుతుంది. ఆ ఋణాన్ని 8 వాయిదాలలో చెల్లించాలి.

రాధాకృష్ణన్, పంత్, స్వర్ణసింగులతో చౌ ఎన్ లై చర్చలు

సంపూర్ణంగా చర్చిస్తున్నామని చౌ, ఇట్టి చర్చలలో దేనినీ వెల్లడించరాదని పంత్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

చైనాప్రధాని చౌ ఎన్ లై ఉపప్రధాని చెన్‌యి, ఉపరాష్ట్రపతి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఇంటికివెళ్లి ఒక గంట సేపు చర్చలు జరిపారు.

చర్చల సరళిని గురించి విలేఖరులు ప్రశ్నించగా మేము సంపూర్ణముగా చర్చిస్తున్నామని మాత్రం చౌ ఎన్ లై చెప్పారు. వివరాలు చెప్ప నిరాకరించారు.

ఇట్టి చర్చలలో దేనినీ వెల్లడించరాదని హోంమంత్రి పంత్ అన్నారు.

టిబెటు కాందిశీకులకు విద్యా సౌకర్యాలు

రాజ్య సభలో నెహ్రూ వివరణ

కొత్తఢిల్లీ, ఏప్రిల్ 21

భారతదేశానికి వచ్చిన టిబెటు శరణార్థులలోని పిల్లలకు యువకులకు తగు విద్యా సౌకర్యాల కల్పించవలసినదిగా దలైలామా భారత ప్రభుత్వాన్నికోరారని ఈనిమిత్తం కొంత ధనాన్నిగూడా దలైలామా ఇవ్వగలనని తెలిపినట్టు [illegible] నెహ్రూ నేడు రాజ్యసభకు తెలిపారు ఆతను ఎంత విరాళాన్ని ఇస్తానన్నది తమకు జ్ఞాపకంలేదన్నారు.

ఫైనాన్స్ బిల్లు ఆమోదం

కొత్తఢిల్లీ, ఏప్రిల్ 21

పన్నుల ప్రతిపాదనలో నిన్న ఆర్థిక మంత్రి సూచించిన మార్పులతో ఆర్థిక బిల్లును లోకసభ నేడు ఆమోదించినది.

గూడ్సుబండి దోపిడి

భోపాల్, ఏప్రిల్ 21

బారాభేడా ఒబైదుల్ గంజ్ స్టేషన్ల మధ్య 15 నుండి 20 మంది వరకుగల ముఠా ఢిల్లికి వెళ్ళుతున్న గూడ్సు స్పెషల్‌ను గతరాత్రి దోపిడిచేసినది. గార్డును ట్రయినులోగల ఇతర రైల్వే స్టాఫ్‌పై దౌర్జన్యం జరిపి వీరు అవసరమైనంత మేరకు దోచుకొని వెళ్లారు.

పత్రిక ధరను బట్టి పేజీల నిర్ణయం

భారత ప్రభుత్వం అమలు జరపాలనుకొంటున్న ముసాయిదా ఉత్తర్వు ప్రకటన: 12 న.పై. లకు మించిన ధర గల పత్రికల మినహాయింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

వార్తాపత్రికల (ధర, పేజీల) చట్టంక్రింద భారత ప్రభుత్వం అమలు జరపాలనుకొంటున్న పేజీలనుబట్టి పత్రికల ధర నిర్ణయం షెడ్యూలు 12 నయాపైసలకు మించిన ధరగల పత్రికలకు అసలు వర్తించదు.

ఈ ముసాయిదా ఉత్తర్వు ప్రతులు నేడు పార్లమెంటు ఉభయ సభలలోనూ ఉంచబడినవి.

12 నయాపైసలు అంతకు తక్కువ ధరగల వార్తాపత్రికలకే యీ ముసాయిదా ఉత్తర్వు ఉద్దేశించబడింది. ఈ ఉత్తర్వు దేశంలో ప్రచురించబడుతున్న దిన పత్రికలలో నాల్గింట మూడింటికి వర్తిస్తుందని ప్రభుత్వ పత్రికా ప్రకటనలో పేర్కొనబడింది. అదేధర రేంజిలోగల యితర దిన పత్రికలకు దెబ్బతగిలేటట్లున్న తక్కువ ధరలకు అధిక పేజీలు వేసే పత్రికలకు దీనివలన నష్టం కల్గుతుంది.

చిన్న పత్రికలలో అనవసర పోటీని నిరోధించి, భారత ప్రకటనా స్వాతంత్ర్యాన్ని గ్యారంటీచేయడమే ఈఉత్తరువు ఉద్దేశంగనుక పెద్దపత్రికల పోటికి పోనవసరంలేదని ప్రభుత్వ ప్రకటనలో పేర్కొనబడింది.

1960 మే 20 లోగా యీ ప్రకటనపై వాఖ్యలురావచ్చునని పేర్కొనబడింది. ఆతరువాత యీ ఉత్తర్వును ఖరారుచేసి అమలు పరుస్తారు.

ఆదివారాలలో వేసే ప్రత్యేకసంచికలకు ఆగస్టు 15 జనవరి 26 లాటి జాతీయ పండుగలకు వేసే సంచికలకు యీఉత్తర్వు వర్తించదు.

ఈఉత్తర్వుప్రకారం వారానికి ఆరు రోజులుప్రచురించబడేవి, ఏడురోజులు ప్రచురించబడేవి అని దినపత్రికల్ని రెండు భాగాలవిభజించారు. ఆతరువాత పేజీ సైజునుబట్టి వాటిని మళ్ళీ విభాగించారు. 336 నుండి 432 చదరపు అంగుళాల వైశాల్యం గలది "ఎ", 275 నుండి 336 చ. అంగుళాల వైశాల్యంగలది "బి", 215 నుండి 275 అంగుళాలమధ్య సైజుగలది "సి".

వారానికి ఏడుసార్లు ప్రచురించబడే పత్రిక ధరనుబట్టి వారానికి యీక్రింది పట్టికలో సూచించిన విధంగా పేజీలను ప్రచురించవచ్చును. అంతకు మించి ప్రచురించరాదు.

ధర న.పై.లలో	"ఎ"	"బి"	"సి"
3	7	9	12
4	14	19	23
5	18	23	28
6	21	28	33
7	28	37	44
8	28	37	44
9	35	47	56
10	42	56	68
11	49	65	79
12	56	72	91

ఈమూడు సైజులకు రానిసైజులో ఉన్న పత్రిక విషయాన్ని ప్రెస్ రిజిస్ట్రార్ నిర్ణయిస్తారు.

ఈఉత్తర్వు జమ్ము-కాశ్మీర్ మినహా దేశమంతటా వర్తిస్తుంది.

ఫ్రాన్స్ అణ్వాస్త్ర ప్రయోగాలలోని అంతరార్థం

అందరికీ ఉండి తమకు లేవే అన్న చింత మాత్రమేనని డిగాల్

ఒటావా, ఏప్రిల్ 20

అణ్వస్త్రాలుగలిగిన అగ్రరాజ్యాలు ఇక వాటిసంఖ్యను పెంచకుండాఉంటే చాలు తాను సంతృప్తి పడగలనని ఫ్రెంచి అధ్యక్షుడు జనరల్ డిగాల్ అన్నాడు. ఆ అగ్రరాజ్యాలు ఉన్న అణ్వస్త్రాలను నాశనముచేసి అణ్వస్త్ర ప్రయోగాల్ని నిలిపివేస్తే ఫ్రాన్స్ మరింత సంతోషిస్తుందనికూడా డిగాల్ ప్రకటించాడు.

ఇతర అగ్రరాజ్యాలకు అణ్వస్త్రాలున్నందున తనకులేదే అన్న చింతతో కూడ్రమే ఫ్రాన్స్ అణ్వస్త్ర ప్రయోగాలకు పూనుకోవలసి వస్తున్నదనీ ఇందుకు తాను చింతిల్లుతూనే ఉన్నాననీ డిగాల్ తెలిపాడు ఇతర రాజ్యాలు మానివేస్తే ఫ్రాన్స్‌కూడా అణ్వస్త్రాల తోలికి పోదని తాను వాగ్దానము చేయగలవన్నాడు.

ప్రెసిడెంట్ డిగాల్ ఉత్తర అమెరికా పర్యటన సందర్భముగా కెనడా ప్రధాని డిఫెన్‌బేకర్‌తో ప్రపంచ సమస్యలమగూర్చి చర్చించాడు. నిన్న మొన్నకూడా ఈ చర్చలు జరిగాయి.

శిఖరాగ్ర సమావేశాన్ని గురించి విలేఖరుల గోష్ఠిలో డిఫెన్‌బేకర్, డిగాల్‌లు ఏకాభిప్రాయము వెల్లడిస్తూ వచ్చే నెలలో జరిగే యీ చర్చలు ముమ్ముందు సాగవలసి ఉన్నచర్చల పరంపరకు నాందికాగలవన్నారు.

శిఖరాగ్ర చర్చలవల్ల జర్మనీసమస్య పరిష్కారము కాదనీ అంతమాత్రాన యీ సమస్య శిఖరాగ్ర చర్చల అజెండాలో చేరరాదన్న అభిప్రాయము తనకు లేదుగాని ప్రస్తుతము ఆ సమస్యను పరిష్కరించే శక్తి సామర్థ్యాలు లేవని మాత్రము చెబుతున్నానని డిగాల్ విలేఖరుల గోష్ఠిలో అన్నాడు.

జర్మనీ పునరేకీకరణకై తూర్పు జర్మన్ కమ్యూనిస్టుపార్టీ గత వారాంతములో ప్రతిపాదించిన ప్రజాప్రణాళికను పశ్చిమ జర్మనీ రాజకీయ పక్షాలన్నీకూడా త్రోసివేశాయని నేడు బాన్ నుండి తెలిసింది.

నగరంలో శృంగేరి శంకరాచార్య స్వామిజీ

హైదరాబాదు, ఏప్రిల్ 21

జగద్గురు శ్రీమదభినవ విద్యాతీర్థ శ్రీ శ్రీ శృంగేరి శంకరాచార్య స్వాములవారు మొన్న నగరంలోకి విచ్చేశారు. అధికార అనధికార పుర ప్రముఖులు స్వామీజీకి ఎదురేగి నగర పరిహద్దులలో స్వాగతం చెప్పారు. ఆంధ్రప్రదేశ్ హోంశాఖామాత్యులు శ్రీ యం. నరసింగరావు, రెవిన్యూ బోర్డు సభ్యులు శ్రీ కె. అనంతరామన్ దేవాదాయశాఖ డైరెక్టరు రాజాత్యంకలాల్, రాజా వెంకటరావ్ లింబేకర్, శ్రీ ఎం. సుందరరాజన్, పోలీసుశాఖ ఇన్స్‌పెక్టర్ జనరల్ శ్రీ ఎం.కె.కె నంబియార్, శ్రీమతి శాంతాబాయి యం.యల్.ఏ. శ్రీయం.వి. గాడ్గిల్, సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టరు శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి ప్రభృతులు స్వామీజీకి ఎదురేగి భక్తిపురస్సరంగా వేదమంత్రాలతో, పూర్ణకుంభంతో స్వాగతం చెప్పారు. సుమారు వేయి మందిభక్తులు యీ స్వాగతోత్సవంలో పాల్గొన్నారు. స్వర్ణ పల్యంకారూఢులై శ్రీ స్వామీజీ కిషన్ బాగ్ వరకు ఊరేగింపుగా వెళ్లారు. శ్రీ త్ర్యంబక్ లాల్ ధూళిపాద పూజ నిర్వహించిన అనంతరం, స్వామీజీ అక్కడి శ్రీకృష్ణ మందిరంలో హిందీలో భక్తులకు సందేశమిస్తూ తమకు సమర్పించిన స్వాగతానికి తమ సంతోషాన్ని తెలిపారు. స్వామీజీ సాయంకాలం శ్రీ శారదా చంద్రమౌళీశ్వరులకు పూజచేసి భక్తులకు ప్రసాదం పంచారు.

నిన్న ఉదయం ఆంధ్రప్రదేశ్ గవర్నరు శ్రీ భీమసేన్ సచార్ స్వామీజీ దర్శనం చేసుకుని భారతీయ ధర్మ ప్రచార విశేషాలను గురించి ఒక అరగంటసేపు వారితో చర్చించి సలహాలు గైకొన్నారు. గవర్నరుకు రాజా త్ర్యంబక్ లాల్, రాజా వెంకటరావు లింబేకర్ పూర్ణకుంభం మొదలైన దేవాలయ మర్యాదలతో స్వాగతం చెప్పి దేవాలయమూ, స్వామీజీ పూజా మందిరమూ చూపించి గవర్నర్‌ను స్వామీజీకి పరిచయంచేశారు.

బ్లాక్ మార్కెట్ ద్వారా ఉదర పోషణ!

హైదరాబాద్, ఏప్రిల్ 21

నగరంలోగల పంచదారకొరత ఒక విధంగా నిరుద్యోగులకు కొద్దిపాటి ఆదాయాన్ని కల్పిస్తున్నదనడములో ఆశ్చర్యం లేదు. వీరు మునిసిపాలిటీ పౌరసరఫరాలశాఖలో చక్కెర తీసి బ్లాక్ మార్కెట్ వ్యాపారస్తులకు అమ్ముకొంటున్నారు. ఈ విధముగా సేరుకు రెండణాల ప్రతిఫలం పొందుతున్నారు.

శార్వరి సం॥ చైత్ర బ॥ ద్వాదశి రా 1-49 పూ భా రా 1-40 ఉ వ 7-49 తెల: 9-36 వరకు (శాలివాహన శకము: 2-2-1882) 1960 ఏప్రిల్ 22 శుక్రవారము

"తమ తమ కలవడు విజ్ఞానముల తెరవు లాదరించి నానా గతులన్ సుమతులు ధర్మము తెలిపిరి దమము పరాయణము ధీరతమ! యన్నిటికిన్".

—భారతము (శాంతి)

గోలకొండపత్రిక

ఫోన్. నెం. 3280

1960 ఏప్రిల్ 22

శుక్రవారము

పాకిస్తాన్‌లో సైనిక ప్రభుత్వము

(౦)

ఈవారము పాకిస్తాన్ బార్ అసోసియేషన్ సమావేశములో అక్కడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రసంగించుచు వెల్లడిచేసిన అభిప్రాయాలు గమనించదగియున్నవి. బార్ అసోసియేషన్ బాధ్యత గల సంస్థ; న్యాయశాస్త్ర నిష్ణాతులైన అనుభవజ్ఞులు సభ్యులుగానున్న యీ సంస్థ వేదిక మీద ప్రకటితమైన అభిప్రాయాలకు ప్రత్యేకమైన విలువగలదు. పాకిస్తాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి యీ సందర్భమున గావించిన ఉపన్యాసములో "...సైనికప్రభుత్వము కొద్ది కాలము మాత్రము అధికారములోనున్న యెడల, అందులో యేదోకొంత సొగసు మరియు భయము ఉండగలవు. కాని యది చాలకాలముపరిపాలించినప్పుడు, సైనికశాసనము సాధారణ శాసనముగా భావింపబడి, దాని వలన ఉద్దేశింపబడిన భయము తొలగిపోవును" అని చెప్పియున్నారు. యీ మాటలు పాకిస్తాన్ అధినేతలమీద యెటువంటి ప్రభావము వేయగలదో చూడవలసియున్నది.

పాకిస్తాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వెల్లడి చేసిన అభిప్రాయాలు ప్రస్తుతము ఆ దేశములోని పరిస్థితిని చక్కగా సూచించుచున్నవి. తమ ఉపన్యాసములో ప్రధాన న్యాయమూర్తి "...మన కొడుకులు అల్లుండ్లు తమ తమ వృత్తులకు సంబంధించిన కర్తవ్యములను విస్మరించి స్వేచ్ఛా జీవితమును గడపుటకు అలవాటు పడగల ప్రమాదము గోచరించుచున్నది. తత్ఫలితముగా దేశములో స్వత్వముల రక్షణకు అవకాశము గూడ అంతరించు ప్రమాదము కనుపించుచున్నది" అని గట్టిగా పేర్కొనియున్నారు. ఈ విధముగా పాకిస్తాన్‌లోని మేధావుల అభిప్రాయాలు, యీ ఉపన్యాసములో ప్రతిబింబించు చున్నవి. ఏదేశములో నైనప్పటికిని సైనిక ప్రభుత్వము చాలకాలము కొనసాగుట వాంఛనీయము కాజాలదు. అందువలన కలుగగల పరిణామాలు దేశశ్రేయస్సుకు అనుకూలమైనవిగా నుండజాలవు. ఇప్పటికిపాకిస్తాన్‌లో సైనికప్రభుత్వము అధికారములోనికి వచ్చి రెండు సంవత్సరాలు గడచిపోవుచున్నవి. సత్వర భవిష్యత్తులో యీ సైనిక ప్రభుత్వము అధికారవిరమణ గావించు సూచనలు గోచరించుటలేదు.

పాకిస్తాన్‌లోని సైనిక న్యాయస్థానాలు సమస్త వ్యవహారాలను విచారించు చున్నట్లు తెలియుచున్నది. ఇది సరియైన పద్ధతికాదు. సైనిక న్యాయస్థానాల విచారణ పరిధి పరిమితమైనదిగా నుండవలెను. సాధారణ ప్రజలదైనందిన జీవితములో ఉత్పన్నమగు సమస్యలను విచారించు అధికారము సైనిక న్యాయస్థానాలకు అప్పగించుట యేమాత్రము సమంజసము కాజాలదు. ప్రస్తుతము పాకిస్తాన్ సైనిక నియంత యీ విధానమును అమలు చేయించుట సరియైన పద్ధతికాదని యీ సందర్భమున పాకిస్తాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేర్కొనియున్నారు. మొత్తముమీద పాకిస్తాన్ హైకోర్టుప్రధాన న్యాయమూర్తి సకాలములో అక్కడి ప్రభుత్వమునకు తగిన హెచ్చరిక గావించియున్నారు

సైనిక నియంతలు ఒకమారు అధికారములోనికి వచ్చినచో, సాధారణముగా వారు దానిని వదలు కొనుటకు యిష్టపడరని చెప్పుటకు ప్రపంచ చరిత్రలో అనేక నిదర్శనాలు కనుపించుచున్నవి. ప్రస్తుత పాకిస్తాన్ అదినేత మిస్టర్ అయూబ్ ఖాన్ ప్రజాస్వామికమును గూర్చి వెల్లడి చేయుచున్న అభిప్రాయాలుకూడ గమనించదగియున్నవి. ఆయనకు పార్లమెంట్ ప్రజాస్వామిక వ్యవస్థమీద విశ్వాసము ఉన్నట్లు తోచదు; ఇందుకు ఆయన పలుమారు చేసిన ఉపన్యాసాలే నిదర్శనముగానున్నవి. పాకిస్తాన్‌కు పార్లమెంటరీ ప్రజాస్వామిక పరిపాలనా పద్ధతి పనికి రాదనియు, యీదేశానికి ప్రత్యేకముగా నియమిత ప్రజాస్వామికము కావలెననియు ఆయన తెలిపియున్నారు. రేపుపాకిస్తాన్ కొరకు సిద్ధము చేయబడు రాజ్యాంగముకూడ యీ అభిప్రాయాలకు అనుగుణముగా నుండగలదని భావించుచున్నాము. ఇటువంటి పరిస్థితులలో సంపూర్ణ ప్రాథమిక స్వత్వములను పౌరులకు ప్రసాదించు ప్రజాస్వామిక పరిపాలన పాకిస్తాన్‌లో వచ్చు అవకాశము యేమాత్రమును కనుపించుట లేదు. ఈ విషయము పాకిస్తాన్‌లోని మేధావులనుఆందోళనపరచుచున్నట్లు పాకిస్తాన్ హైకోర్టు ప్రధానన్యాయమూర్తి ఉపన్యాసము ఋజువు చేయుచున్నది. సైనిక ప్రభుత్వము తొలగిపోయి, ప్రజాస్వామ్యయుత పరిపాలన కావలెనని పాకిస్తాన్ ప్రజలు కోరుచున్నట్లు కూడ యిందువలన వెల్లడియగుచున్నది. కొంతకాలము క్రింద మిస్టర్ అయూబ్ ఖాన్ తన అధ్యక్షపదవికి ప్రజల సమ్మతి ఓటు సంపాదించిన సందర్భమున శుభాభినందనలు పంపుచు, అమెరికా అధ్యక్షులైన జనరల్ ఐసెన్‌హోవర్ పాకిస్తానులో సత్వరముగా ప్రజాస్వామిక పరిపాలన యేర్పాటు కావలెనని ఆశించియుండిరి. మిస్టర్ ఐసెన్‌హోవర్ అభిప్రాయము సమంజసమైనది. పాకిస్తానులో సాధ్యమైనంత త్వరగా, ప్రజాస్వామ్యయుతమైన సివిల్ పరిపాలన కావలసియుండును. ఈ సందర్భములో పార్లమెంట్‌లో సైనిక ప్రభుత్వము యేర్పడి కొంతకాలము పనిచేసి, తరువాత సాధారణ యెన్నికలు జరపించి ప్రజాస్వామిక ప్రభుత్వము యేర్పాటు గావించిన సంఘటన మార్గదర్శకమై యున్నది.

దక్షిణకొరియా ప్రభుత్వం రాజీనామా

ప్రెసిడెంట్ సింగ్మన్‌రీ ఆమోదం: విద్యార్థి కల్లోలాల ఫలితం

సియోల్, ఏప్రిల్ 21

దక్షిణ కొరియా ప్రభుత్వంలోని 12 మంది మంత్రులు యీ ఉదయం ప్రెసిడెంటు సింగ్మన్‌రీకి తమ రాజీనామాలను దాఖలుచేశారు. మంగళవారం నాటి విద్యార్థి కల్లోలాలకు మంత్రివర్గం పూర్తి బాధ్యత వహిస్తూ రాజీనామా చేసింది.

సియోల్ నగరంలోను ఇతర పట్టణాలలోను సాగిన కల్లోలాల దృష్ట్యా ప్రధానమంత్రుల కష్టనష్టాలను తీర్చడానికి ప్రెసిడెంటు సింగ్మన్‌రీ నిన్న హామీ యిస్తూ బహిరంగ ప్రకటనచేసిన తరువాత మంత్రివర్గం సమావేశమయి రాజీనామా నిర్ణయం గయికొన్నది. రిపబ్లికన పార్టీ అసాధారణమయిన మధ్యవర్తిత్వం వెల్లడిస్తున్నట్లుందని అభిజ్ఞులు భావించారు.

వందమంది మృతి

సియోల్ కొట్లాటల్లో మంగళవారంనాడు 94 గురు పౌరులు, ముగ్గురు పోలీసులు చనిపోయినట్లు మరో పోలీసు కానరావడం లేదనీ దక్షిణకొరియామార్షల్ లాకమాండు నేడు వెల్లడించింది. 456 మంది పౌరులు, 200 మంది పోలీసులు, 47 మంది పైమ్రెను గాయపడ్డారట.

ఈలోగా తిరిగి కల్లోలాలు రేగకుండా సైనిక దళాలు జాగ్రత్తా చర్యలు గయికొంటున్నాయి. ప్రభుత్వం నష్టపరిహార ధనంతోపాటు శవాల్ని బంధువులకు అప్పగిస్తున్నదికూడా

భారీ అరెస్టులు కూడవన్న ఆదేశం ప్రకారం గత రెండుదినాలలో అరెస్టయిన 6 వందలమందిని పోలీసులు విడుదల చేశారు. 37 మంది మాత్రం అరెస్టులో ఉంచబడ్డారు. ప్రెసిడెంట్ రీ భవనానికి దారితీసే రోడ్లన్నీ మూసివేయబడి వున్నాయి. నగరంలో ట్రాఫికు రద్దీ తగ్గించడానికయి సిటీబస్సులు ట్రక్కుల రాకపోకలు నిషేధించబడ్డాయి.

దక్షిణ కొరియా మంత్రివర్గము రాజీనామాను ప్రెసిడెంటు సింగ్మన్‌రీ ఆమోదించినట్లుకూడాతదుపరి మంత్రిమండలి ప్రకటించింది. సమాచార శాఖ డైరెక్టరు, ప్రభుత్వ అధికార ప్రతినిధి మరో ఉన్నతాధికారికూడా తమ పదవులకు రాజీనామాలిచ్చారు.

పాకిస్తాన్‌లో తేయాకుపై పన్ను హెచ్చింపు

దేశంలో వాడకం తగ్గించి ఎగుమతులకు కేటాయించాలని సంకల్పం

రావల్పిండి, ఏప్రిల్ 21

తేయాకు ఎక్సయిజు పన్నులో పౌనుకు నాల్గణాలు హెచ్చిస్తూ పాకిస్తాన్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయం యీఉదయం జరిగిన మంత్రిమండలి సమావేశంలో గైకొనబడింది.

తక్షణమే పౌనుకు 6 అణాలనుండి 10 అణాలకు తేయాకుపై పన్ను పాకిస్తాన్‌లో పెంచబడుతుంది మంచి రకపు పాకిస్తాన్ తేయాకుమార్కెట్ నుండి ఉపసంహరింపబడి ఎగుమతులకు కేటాయింపబడి ఇతర రకాలు గతసంవత్సరం రేట్లకన్న ఎక్కువ రేట్లకు అమ్మబడుతున్న సమయంలో యీ ఎక్సయిజు పన్ను హెచ్చింపు సంభవించింది.

దేశంలో టీ వాడకం తగ్గించేట్లు చేసి విదేశీ మారక ద్రవ్యం సంపాదనకై ఎక్కువగా టీని ఎగుమతులకు కేటాయించాలని ప్రభుత్వం ఉద్దేశిస్తున్నట్లు అధికార వర్గాలవారంటున్నారు.

రిపబ్లికన్‌గా ఘనా, క్వమేన్ క్రుమా అధ్యక్షత

ప్లెబిసైట్‌లో పలువురి అభిప్రాయం

అక్రా, ఏప్రిల్ 21

ఘనా రిపబ్లిక్‌గా ప్రకటింపబడాలనీ ప్రస్తుతప్రధాని డా॥ క్వమేన్ క్రుమా అధ్యక్షుడుగా ఉండాలనీ ఎక్కువసంఖ్యలోకోరుతూ ఘానాలో జరిగిన ప్లెబిసైట్ ప్రథమదశలో ఓటర్లు అభిప్రాయం వెల్లడించారు.

క్వమేన్ క్రుమా అధ్యక్షుడు కావాలని 56389 మంది ఓటు చేయగా ప్రతిపక్ష యునైటెడ్ పార్టీ నాయకుడు డా॥ జోసెఫ్ డాన్‌క్వా అధ్యక్షుడు కావాలని 19696 మంది ఓటుచేశారు. ఘనా రిపబ్లిక్ కావాలని 55989 మంది వద్దని 20965 మంది ఓటు చేశారు.

ప్లెబిసైట్ రెండో దశ ఓటింగు శనివారం సాగుతుంది.

పాక్ మంత్రిమండలి శాఖల పునర్విభజన

రావల్పిండి, ఏప్రిల్ 21

పాకిస్తాన్ అధ్యక్షుడు జనరల్ అయూబ్ ఖాన్ కామన్వెల్త్ ప్రధానుల సమావేశానికై లండన్ వెళ్ళినప్పుడు ఆయన స్థానే పాకిస్తాన్ ఆరోగ్య మంత్రి లెఫ్టినెంట్ జనరల్ బుర్కీ వ్యవహరిస్తాడని అధికారికంగా వెల్వడింది.

మునుపు జనరల్ అయూబ్ ఖాన్ విదేశాల్లో ఉన్నప్పుడు ఆయన స్థానే సీనియర్ మంత్రి లెఫ్టినెంట్ జనరల్ ఎం. ఖాన్ వ్యవహరించాడు. ఇప్పుడు ఎం. ఖాన్ తూర్పు పాకిస్తాన్ గవర్నరుగా నియమింపబడ్డాడు

గత రాత్రిపోర్టుఫోలియోలమార్పు కూడా ప్రకటించబడింది. అయూబ్ ఖాన్ తాను నిర్వహిస్తున్న కాశ్మీర్ వ్యవహారాల శాఖను సమాచార జాతీయ పునర్నిర్మాణ శాఖ మంత్రి ఎ భుటోకుఅప్పగించాడు. మునుపు ఎం. ఖాన్ నిర్వహించిన ఆహార వ్యవసాయ పునరావాస శాఖలు దేశీయాంగ సరిహద్దుప్రాంతశాఖలమంత్రి లెఫ్టినెంట్ జనరల్ షేక్‌కు ఇవ్వబడ్డాయి. భుటో అధ్యర్యాన ఇంధనం, విద్యుత్తు, సహజ సంపదల శాఖ ఒకటి కొత్తగా ఏర్పాటు చేశారు.

మరో ఇద్దరు మాజీ గవర్నర్‌లు జాకిర్ హుస్సేన్, అక్తర్ హుస్సేన్‌లు మంత్రివర్గంలో చేరిన తరువాత పోర్టుఫోలియో పునర్విభజనజరుగుతుందనుకుంటున్నారు.

మహబూబ్ నగరంలో ఆహార యిబ్బందిలేదు

జిల్లాపరిషత్తు సాయిసంఘ సమావేశంలో కలక్టర్ వివరణ

మహబూబ్‌నగర్ ఏప్రిల్ 21

కలక్టర్ శ్రీ శంకర గురుస్వామి మహబూబ్‌నగరం జిల్లా పరిషత్తు స్థాయీ సంఘ సమావేశానికి అధ్యక్షతవహిస్తూ జిల్లాలోని ఆహార పరిస్థితిని సమీక్షించారు.

మార్కెటులో తిండిగింజల కొరత లేదన్నారు వినియోగదార్లు ఎట్టి ఇబ్బందీ లేకుండా తిండిగింజల్ని పొందుతున్నారు.

ఈ నెలలో ఈజిల్లాకు రిజర్వ్ బోర్డు 75 టన్నుల గోధుమను మంజూరుచేసిందని ఆయనన్నారు జిల్లా అవసరాల్ని దృష్టిలో ఉంచుకొని ఆ కోటా ధాన్యం వర్తకులకు పంపిణీ చేయబడింది మార్చి నెలకు కేటాయించబడిన 1270 టన్నులూ పంపిణీ చేయబడినవి.

వ్యవసాయోత్పత్తిని సమీక్షిస్తూ ప్రస్తుత సంవత్సరంలో 15 గ్రామాలలో 23 బీజక్షేత్రాలు నెలకొల్పబడినవన్నారు.

2841 టన్నుల రసాయనిక ఎరువులు యింతవరకూ పంపిణీ చేయబడినవన్నారు.

మున్సిపల్ ప్రాంతంలోని ప్రభుత్వ కార్యస్థలాలు

మున్సిపాల్టీల స్వాధీనం చేయడానికి త్వరలో ప్రభుత్వం చర్యల్ని గైకొంటుందని వెల్లడి

ఏలూరు, ఏప్రిల్ 20

వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన మునిసిపల్ ఆవరణలో ఉన్న కార్యస్థలాల్ని మున్సిపాల్టీల అధీనంలోకి తెస్తూ త్వరలోనే ప్రభుత్వం చర్యల్ని గైకొంటుందని కార్మిక పరిశ్రమలు, మునిసిపల్ పరిపాలనా మంత్రి శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి నిన్న తనకు జరిగిన పౌరసన్మానానికి సమాధాన మిస్తూ చెప్పారు.

అభివృద్ధికి తగు ఆర్థిక సహాయం చేయడంలో ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకే ప్రాధాన్యం యిస్తుందగనుక యికముందు మునిసిపాలిటీలకు ప్రభుత్వ గ్రాంటులు, సహాయం యిక మునిదు లభించక పోవచ్చు నన్నారు. అస్తుల్ని సరిగా అంచనాకట్టి ఆస్తి పన్నును వసూలు చేయడంద్వారా మునిసిపాలిటీలు తమ ఆదాయాన్ని పెంపొందించుకోగలవు.

ఆ తరువాత మంత్రి రు. 1 లక్షతో ఏలూరు కాలువపై నిర్మించబోయే వంతెనకు శంకుస్థాపనం గావించారు.

ఎరువుల పంపిణీ దర్యాప్తు కమిటీ

ఏప్రిల్ 29 నుండి మే 6 వరకూ రాష్ట్రంలో పర్యటన

హైదరాబాద్, ఏప్రిల్ 21

ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయశాఖ డైరెక్టర్ శ్రీ డి. విశ్వనాథరెడ్డి, వినియోగదార్ల ప్రతినిధి శ్రీ ఇ. వి. వీరరాఘవయ్య భారత వ్యవసాయ పరిశోధనా కౌన్సిల్ వ్యవసాయ కమిషనర్ శ్రీ జె ఎస్. పటేల్ అధ్యక్షతలో ఏర్పడిన ఎరువులపంపిణీ దర్యాప్తు సంఘ సభ్యులుగా కోఆప్టు చేసుకోబడినారు.

ఎరువుల పంపిణీ విధానం తదితర వివరాల్ని పరిశీలించడానికి వివిధ రాష్ట్రాలలో పర్యటిస్తున్న ఆ కమిటీ ఏప్రిల్ 29న హైద్రాబాద్ వచ్చి మే 3 వరకూ నెల్లూరు, గుంటూరు, మహబూబ్‌నగరం, హైద్రాబాద్ జిల్లాలలో పర్యటిస్తుంది. ఈ కమిటీ తమ పర్యటనలో వ్యవసాయదార్లను కలుసుకొని అధికార్లు, ఎరువులమిశ్రమాల ఉత్పత్తిదార్లు, తదితరులతో చర్చలు జరుపుతుంది.

శిక్షణశిబిరాలలో స్టయిపండ్ హెచ్చింపు

జిల్లాకలక్టర్ గురుస్వామి వెల్లడి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 21

మహబూబ్‌నగరం జిల్లా కలక్టర్ శ్రీ శంకర గురుసామి జిల్లా పరిషత్తు పరిశ్రమల స్థాయీ సంఘసమావేశంలో ప్రసంగిస్తూ జిల్లాలో పరిశ్రమల పథకాల పురోభివృద్ధిని సమీక్షించారు.

మద్దిలో తోలువస్తువుల ఉత్పత్తికి ఒక కేంద్రాన్ని నెలకొల్పడం జరిగిందనీ అది పదిమందికి శిక్షణయిస్తూ సంతృప్తికరంగా పనిచేస్తున్నదనీఅన్నారు.

పాడ్‌నగర్‌లోని ప్రాంతీయ గ్రామీణ కళాకారుల కేంద్రం కూడ పదిమంది, నేత తోలుపరిశ్రమ, బ్లాక్ స్మిత్‌లో 53గురికి శిక్షణ యిస్తున్నదన్నారు.

విద్యార్థికి నెలకు రు. 8-56 న.పై. గాక రు 30 యివ్వాని నిర్ణయించబడిందని కలక్టర్ అన్నారు. కళాకారులకు ఋణాలిచ్చే పథకం క్రింద రు.40,000 మొత్తంలోరు.38,750ఇప్పటికే 78 మంది కళాకారులకు అందినదన్నారు.

ఇండియాకు కోటి 84 లక్షల డాలర్ల అమెరికా ఋణం

వాషింగ్టన్, ఏప్రిల్ 21

అమెరికాప్రభుత్వం మొత్తం 18,400 వేల డాలర్లుగల రెండు ఋణాలను భారత దేశానికి ఇస్తూ నిన్న ప్రకటన చేసింది.

అభివృద్ధి ఋణనిధిద్వారా లభింపజేయబడిన యీ ఋణాలు మైసూరు రాష్ట్రంలోని భారీ జలవిద్యుత్ ప్రాజెక్టుకు, భారతీయ ప్రయివేటు పరిశ్రమలకు తిరిగి ఋణమివ్వడానికై పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషన్‌కు వినియోగింపబడుతాయి.

ఈ ఋణాలకు సంబంధించిన వివరాలు మాత్రం ఇంకా సంప్రదింపులో వలసి ఉంది.

బెంగుళూరుకు ఆగ్నేయంగా 235 మైళ్ళదూరాన శరావతినదిపై ఉద్దేశింపబడిన జలవిద్యుత్ ప్రాజెక్టుకు 8,400 వేల డాలర్ల ఋణం కేటాయించబడింది. ఈ ప్రాజెక్టు మొత్తం ఖర్చు 76,900 వేల డాలర్లు.

సుప్రీం కోర్టుకు నానావతి దరఖాస్తు

అపీలు అనుమతికై

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

బొంబాయి వ్యాపారస్తుడు ప్రేం భగవాన్‌దాస్ అహూజాను హత్య చేశాడన్న నేరంపై జన్మఖైదు శిక్ష విధించిన బొంబాయి హైకోర్టు తీర్పు మీద అపీల్ చేసుకోడానికి ప్రత్యేకానుమతి కోరుతూ కమాండర్ నానావతి యీనేల సుప్రీం కోర్టులో దరఖాస్తు దాఖలు చేశారు.

ఈ దరఖాస్తు విచారణ వచ్చే వారంలో జరుగుతుంది.

తనభార్యనిల్వీయాకుఅహూజాతో అక్రమ సంబంధం ఉన్నదని తెలుసుకొన్న తరువాత గత ఏప్రిల్ 27 న కమాండర్ నానావతి అహూజాను కాల్చిచంపాడనిప్రాసిక్యూషన్ కథనం.

సెషన్సుజడ్జి విచారణ సమయంలో జ్యూరీ 8-1 మెజార్టీతో కమాండర్ నానావతి నిర్దోషి అని తీర్పుఇచ్చినది. కాని జ్యూరీ తీర్పుతో ఏకీభవించక సెషన్సుజడ్జి యీ అంశాన్ని హైకోర్టుకు నివేదించారు.

కమాండర్ నానావతినేరంచేసినట్లు నిర్ణయించి హైకోర్టు జూరీ తీర్పును త్రోసివేసి అతనికి యావజ్జీవ ఖైదు శిక్షను విధించినది. ఈ ఉత్తర్వుయావత్తు రేకంగానే రాజ్యాంగంలోని 136వ ఆర్టికిల్ క్రింద నానావతి సుప్రీంకోర్టుకు దరఖాస్తు పెట్టుకొన్నాడు.

నానావతి అపీలును సుప్రీంకోర్టు పరిష్కరించేవరకూ అతనికై విధించబడిన యావజ్జీవ శిక్షను రాజ్యాంగంలోని 161వ ఆర్టికిల్ క్రింద బొంబాయి గవర్నర్ రద్దుచేశారు.

కంతాయపాలెంలో అగ్ని ప్రమాదం

పట్వారీకుటుంబానికి తీవ్ర నష్టం

వరంగల్లు, ఏప్రిల్ 21

దాదాపు 10వేలరూపాయిలైనా విలువగల ఆస్తి గత 16వతేదీ ప్రాయంత్రము మానుకోట తాలూకాకు చెందిన కంతాయపాలెం గ్రామములో అగ్నిప్రమాదము జరిగినప్పుడు దగ్ధమైంది. పట్వారి ఇంటితోపాటుఅయిదు ఇండ్లు దగ్ధమయినవి.

స్థానిక పట్వారి శ్రీ నర్సింహారావు ఇంటిలో ఈ ప్రమాదము జరిగింది ఆయన ఒక్కనికే దాదాపు 10వేల రూపాయిల నష్టము సంభవించింది. శ్రీ నర్సింహారావు, ఆయనతల్లి, పెళ్లైలు కట్టుబట్టలతో మిగిలారు. పర్వము అగ్నికి ఆహుతి అయింది. గౌండ్ల వ్యక్తి ఇల్లు, చాకలివాని ఇల్లు, గొల్లవాని ఇల్లు, శ్రీ నర్సింహారావు ఎడ్ల కొట్టము అయిదు ఏడుపాలలో కాలికుప్పగా కూలిపోయినవి. ఈ ప్రమాదములో పశునష్టముకూడా జరిగింది.

తొర్రూరు మండల కాంగ్రెసు కమిటి ఉపాధ్యక్షులు శ్రీ తమ్మెర లక్ష్మీకాంతరావు ఒక పత్రికా ప్రకటన చేస్తూ ఈస్థితిలో ప్రభుత్వము ఈ అగ్నిబాధితులకు తగు సహాయము చేయాలని కోరారు.

అక్రమ వాగ్దానాలుచేసి హరిజనులనుండి డబ్బు స్వాహా

తొర్రూరు మండల కాంగ్రెసు కమిటి సభ్యులొకరు అమ్మాపురం గ్రామములోని హరిజనులు సాగుబడి చేస్తున్న పీకం భూములను పట్టాలు చేయిస్తానని చెప్పి కొన్ని వేల రూపాయిలను కాజేశారని అమ్మాపురం గ్రామ సర్పంచ్ శ్రీ పి. వీరభద్రం తెలుపుతున్నారు.

ఈ విషయాన్ని మండల కాంగ్రెస్ అధినేతలు తాలూకా కాంగ్రెసు వారు పరిశీలించి తగుచర్యలు తీసుకొని హరిజనుల డబ్బు తిరిగి ఇప్పించే ప్రయత్నం చేస్తారని ఆశిస్తున్నానని కూడా ఆయన అన్నారు.

నెల్లికుదురు ప్రాంతంపై అశ్రద్ధ?

వరంగల్ జిల్లా పరిషత్తు అధికారులు పక్షపాత బుద్ధితో వ్యవహరిస్తున్నారని నెల్లికుదురు ప్రాంత (నాన్ బ్లాక్) ప్రజలు భావిస్తున్నారు. ఈ ప్రాంతం పూర్తిగా అన్ని రంగాలలో వెనుకబడివుంది. స్వతంత్రం వచ్చినా ఇంతవరకు ఏలాంటి అభివృద్ధి జరుగలేదు. రోడ్లులేవు, వైద్యశాలలు లేవు, నీటివసరులు వున్నా వాటిపై ఆనకట్టలు నిర్మించబడటంలేదు. వాటి విషయంలో పరిశీలనను జరిపి అభివృద్ధికి కృషిచేయవలసిందిగా ఈ ప్రాంత ప్రజలు జిల్లా పరిషత్తు అధ్యక్షునికి విజ్ఞాపనపత్రాన్ని సమర్పించుకున్నారు. (మా. వి)

రోదసీపరిశోధక సంఘంలో ఇండియాకుశాశ్వత సభ్యత్వం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

రోదసీ పరిశోధన సంఘములో పర్యాయ సభ్యత్వము వహించవలసిందని ఇండియాను మొదట కోరడము జరిగిందనీ, ఇప్పుడు శాశ్వత సభ్యత్వం వహించవలసిందిగా కోరారనీ, కేంద్ర వైజ్ఞానిక పరిశోధనా సాంస్కృతిక వ్యవహారాలమంత్రి డాక్టరు హుమాయూన్ కబీర్ రాజ్యసభలో నిన్న ఒక ప్రశ్నకు జవాబిస్తూ చెప్పారు.

ఈ రంగములో భారతదేశము చేసిన కృషిని వివరిస్తూ అంతర్జాతీయ భూభౌతిక సంవత్సరములో కృత్రిమ ఉపగ్రహాల జాడ తెలుసుకుంటూ ఉండడానికి అమెరికాలోని స్మిత్సోనియన్ ఇన్‌స్టిట్యూట్ సహాయముతో యు. పి. ప్రభుత్వ ఖగోళ వేధశాలవారు ఒక సున్నితమైన దృక్శాస్త్ర సంబంధమైన కెమెరాను వైనిటాల్ వద్ద నెలకొల్పాలని డాక్టరు కబీర్ చెప్పారు. కృత్రిమ ఉపగ్రహాలు పంపించే రేడియో ప్రసారాలను ఇండియాలోని అనేక వైజ్ఞానిక సాంకేతిక శాస్త్ర సంస్థలు అడపా దడపా స్వీకరించి తెలుసుకుంటున్నాయనీ కొన్ని ప్రత్యేక రకాల ట్రాన్సిస్టర్లను ఉపయోగించి, బహిరంతరిక్షము, వాతావరణములోని ఎగువ పొరలకు సంబంధించిన సమాచ

